

# రోషనార

ప్రసాద్



## సీరియల్

అది వసంతం. సూర్యాతపంబున ఆకురాల ఎండి మోడులు వారిన తరులు, క్రొంగొత్త చివురులు సంతరించుకుని వినూత్న శోభలు వెద జల్లుతున్నాయి. దుర్గమ పర్వతారణ్యమయమైన వింధ్యాటవీ ప్రాంతం ఉదయభానుని మేలి బంగారు కాంతులలో నేత్రానందకరంగా గోచరిస్తున్నది. వన్నె చిన్నెలు తీర్చిదిద్దుకుని వచ్చిన వసంతాన్ని చూచి కఠిన శిలలు సైతం కళకుదనాన్ని కాదు పొమ్మని లావణ్యాన్ని చిందిస్తున్నాయి.

వసంతునకు చెలికాడు మన్మధుడు. వారి స్నేహము అసామాన్యమైనది. అజేయమైన శక్తి వారి స్నేహపు సొత్తు. వారిరువురూ కలసి ప్రయత్నించిన నాడు స్థాణుడని పేరు బొందిన పరమేశ్వరుడే చలించి పోయాడు. కంటికెదురుగా ఉన్న కన్నెపడుచుపై మరులు గొనకుండా మనసునరికట్ట లేకపోయాడు. అంతటి ఘనకార్యం సాధించాడు మన్మధుడు. అతడికందులో సర్వవిధాలా సాయపడిన వాడు, అతడి అనుంగు చెలికాడు వసంతుడు. లయకారుడైన తనతో ఆటలాడిన మన్మధునిపై మహేశ్వరునికి వల్లమాలిన కోపం రాకపోలేదు.

మూడవ నేత్రాన్ని తెరచి అగ్నిని కురిపించాడు. సశరీరుడై తన ఎదుట విజయగర్వంతో నిలచి ఉన్న మన్మధుని పొగరణచటానికి ప్రయత్నించిన శంభుడు అతణ్ణి అశరీరుణ్ణి మాత్రమే చేయగలిగాడు. కాని, అంతమొందించ లేకపోయాడు. అందుతో మన్మధుని గర్వం అతిశయించింది. స్వంత శరీరం అంటూ లేకపోవటం వల్ల ప్రపంచంలోని అన్ని శరీరాలు అతడివే ఐనాయి. అతడు చేసే దుర్మార్గాలూ పెచ్చు పెరిగి పోయాయి. ఆముష్మిక చింతలో సర్వసంగ పరిత్యాగం చేసిన మహర్షులను సైతం కీలుబొమ్మలను చేసి, కనిపించిన ప్రతి అతివ వెంటా, గోవు వెంట దగులు కోడెల్లా పరువు లెత్తించాడు.

సార్వభౌములకు సామాన్య కాంతపై మోజు. సార్వభౌమ తనూజకు సాధారణ సిపాయిపై వలపు. పదిమంది బిడ్డల తల్లికి పదకొండవ మిండగాని కొరకు తాపత్రయం—అబ్బ! ఒకటేమిటి-అతడు చేసే ఘోరాలకు అంతూ పంతూ లేదు. ఎంతటి శక్తివంతులైనా అతణ్ణి ఎదిరించలేరు, అశరీరుడైన అతణ్ణి హతమార్చలేరు. ఏదో ఒక రోజుకు నిగ్రహం కోల్పోవటం ఎంతటివారికైనా తప్పదు. అతడికి దాసుడైనవాడు ఎంతకైనా తెగిస్తాడు, ఎన్ని ఘోరాలైనా చేస్తాడు. అతడి చేతలకు మంచీ చెడు అన్న విభేదం నశిస్తుంది. అందుకే ప్రేమ గ్రుడ్డిది అంటారు.

మన్మధుని స్వైరవిహారానికి హంగుదారుడు వసంతుడు. మన్మధుని విజృంభణకు కావలసిన విధంగా ప్రకృతిని అందచందాలతో సింగారించేది అతడు. మనోజుని వింటికి కావలసిన ఇక్షు దండాన్ని, పూతీవనారినీ సమకూర్చేది అతడు. సౌందర్యశోభల చెన్నొందు పుష్పమాలను సంతరించి అమ్ములుగా అందించేది అతడు. జగతిని రతీ మన్మధుల శృంగారకేళీ వినోదపు శోభనశయ్యగా అలంకరించేది అతడు.

ఆనాడు మన్మధ వసంతు లిరువురూ వింధ్యాటవికి విహార నిమిత్తం అరుదెంచారా! అన్నంత సుందరతరంగా ఉంది ప్రకృతి.

"ఒహోం-ఒహోం-ఒహోం" అంటూ బోయీలు బంగారు మేనాను తమ భుజాలపై నుంచుకుని ముందుకు నడుస్తున్నారు. వారి వెనుక సాయుధులైన సైనికులు పదిమంది అశ్వారూఢులై వస్తున్నారు. మేనాలోని స్త్రీ మూర్తి పరదాను వారగ తొలగించి ఒక్కసారి పరిసరములను పరికించింది. ఆమె రోషనార. చండశాసనుడైన మొగలు చక్రవర్తి ఔరంగజేబు పాలిటి చండశాసని. అతని సోదరి.

పురివిప్పిన వన మయూరి మేఘాచ్ఛాదితమైన ఆకసమును చూచి నృత్యం చేస్తున్నది. కోయిల 'కూ' అంటూ రాగాలాపన చేస్తున్నది. కొమ్మపైనున్న పావురముల జంట క్రిందగుచూ మీదౌచూ ఆనందాన్నంతటిని ఇతరుల కందనివ్వరాదన్నంత ఆవేశంతో అనుభవిస్తున్నది. శిలలమీది నుండి మంజులనాదం చేస్తూ ప్రవహిస్తున్న నర్మదానదములో ఏనుగుల జంట జలక్రీడ సల్పుతున్నది.

ఆదినుండి పురుషద్వేషి అయిన రోషనార చిత్తమున ఏదో

విభ్రాంతి ప్రవేశించింది. అర్థంకాని ఆనందమూ, ఆ ఆనందంతోపాటు అవగాహన కాని బాధ, అదే సమయంలో అన్వయం కుదరని ఆగ్రహమూ ఆమెలో ఆవిర్భవించాయి. పరదాను తటాలున మూసివేసింది. కాని, తన హృదయ కవాటమును మాత్రం మూసివేయలేకపోయింది. అంతవరకూ ఆమెను సమీపించటానికి భయపడిన ఏవేవో భావాలు ఆమెను చుట్టుముట్టి అల్లకల్లోలం చేయసాగాయి. ఏమిటీ జీవితం? ఏమిటీ ఆనందానుభూతి?.... ఈ ప్రశ్నలు ఆమె మస్తిష్కాన్ని మధిస్తున్నాయి. తనకు ఐశ్వర్యం ఉంది, అధికారం ఉంది, యావద్భారత దేశాన్ని క్రీగంటి చూపున అజమాయిషీ చేయగల శక్తి తన సొత్తు. తన నిర్హేతుక కటాక్షానికి ఎవరు నోచుకుంటే అతడే ఢిల్లీ సింహాసనానికి అధినాథుడు. తాను కాదన్న మరుక్షణం హంసతూలికా తల్ప సదృశమైన ఆ సింహపీఠి కంటక పూరితమౌతుంది. దానిపై ఆశీనుడైనవాడు కంటక క్లేశాన్ని భరించలేక క్షణాలమీద క్రిందికి దొర్లిపోతాడు. భారతదేశ చరిత్రలో తనకుగల విశిష్ట స్థానం అపూర్వమైనది. అప్రతిహతమైనది తన శక్తి. ఇది అనుభవం కాదా? దీనికి మించిన అనుభూతి స్త్రీ పురుష సమాగమంలో ఉందా? అసంభవం- ఏమో, ఉన్నదేమో! ఎవరు చూచారు? లేకుంటే ఇన్ని ప్రణయ కథలు ఎందుకు ప్రచారమౌతాయి?

రోషనార ఫక్కున నవ్వింది. ఆమెలో ప్రభవిల్లిన చిత్ర విచిత్ర ఆలోచనలు ఆమెకే నవ్వు పుట్టించాయి. "బానిస బ్రతుకులోని సుఖం కన్నా స్వేచ్ఛా జీవనంలోని కష్టాలే మేలైనవి సుమా!" అంది రోషనార, తన మేనాలో తన కెదురుగా కూర్చున్న ఆంతరంగిక పరిచారిక జూమీలియాను చూచి. ఆ మాటల సందర్భం అర్థంకాని జూమీలియా యజమానురాలి కండ్లలోకి ఆశ్చర్యంగా చూచింది.

"జానే, సంసార జీవనంలో సుఖం ఉందంటావా?" రోషనార ప్రశ్నించింది.

జూమీలియాకు రహీం అనే ప్రియుడు ఉన్నాడు. వారిరువురి మధ్య నడుస్తున్న గ్రంథం రోషనారకు తెలుసు. మరొక దాసి విషయంలో అయితే ఆమె ఏమి చేసి ఉండేదో తెలియదు. కాని, జూమీలియా ఆంతరంగిక నెచ్చెలి కూడా కావటంవల్ల, రోషనార చూచీ చూడనట్లు ఊరుకుంది. అప్పుడప్పుడు మాత్రం 'ఏమే జూమీలియా, రహీం నాకన్నా

నీకు ఎక్కువవాడు కదటే' అని పరియాచకం ఆడటం కూడ కద్దు. జూలియా యజమానురాలి మన స్తత్వ మెరిగిన జాణ కావటం వల్ల రోషనార అలా అన్నప్పుడల్లా 'అమ్మమ్మా! ఎంతమాట అన్నారు? నా దురదృష్టం కొద్దీ మీరు స్త్రీలై జన్మించారు కాని, లేకుంటేనా, వెయ్యి మంది రహీంలు వెంటపడినా కన్నెత్తి చూచేదాన్నా?' అంటూంటుంది.

రోషనారలో తాను పురుషుడై జన్మించక పోతినే అనే బాధ అప్పుడప్పుడు పొడ చూపుతుంటుంది. నిజానికి ఆమె పురుషుడైతే ఔరంగజేబు కాదు, ఆమె సింహాసనాన్ని అధిష్టించి ఉండేది. ఆ విషయమై ఆమె లోలోన మధనపడటం జూలియాకు తెలుసు. అందువల్లనే సమయం చిక్కినప్పుడల్లా 'మీరు పురుషులై జన్మిస్తే—' అంటుంటుంది జూలియా. ఆ మాట విన్నప్పుడల్లా రోషనారలో విద్యుత్ ప్రసారం జరుగుతుంది. రోమాలు నిక్కపొడుచుకుంటాయ్. ఎదురుగా ఉన్న జూలియాను గాఢంగా కౌగలించి చుంబిస్తుంది. ఆ తరువాత మరు క్షణంలో 'ఛీ, పో-దూరంగా' అని కసిరి కొడుతుంది. అది నిజమైన కోపం కాదని తెలిసిన జూలియా ముసిముసి నవ్వులు నవ్వుకుంటూ వెళ్ళిపోతుంది.

ఆ నాడు కూడా రోషనార ప్రశ్న వినిన జూలియా ముసి ముసి నవ్వులు నవ్వింది. రహీంతోడి తన అనుభూతిని గురించి రోషనార ప్రశ్నిస్తున్నదని జూలియాకు తెలుసు.

"నవ్వుతావేమే నంగనాచిలా - సంసార జీవనంలో నిజంగా సుఖం ఉందంటావా?" రెట్టించింది రోషనార.

"లేకపోవట మేమిటమ్మా?"

"సంపన్నం కాని సంసారంలో?"

"అక్కడా సుఖం కష్టాలతోపాటుగా కలసి మెలసి కాపురం చేస్తుంది."

"ఎలాంటి సుఖమే? బక్కచిక్కిన ప్రేవులతో అలమటిస్తున్న ఆలు మగలకు సుఖం ఉందంటావా?"

"ఉందమ్మా! అదో రకపు శారీరక సుఖం, మానసిక తృప్తి. మరో విధంగా చెప్పాలంటే మనిషికి మనిషి తోడుగా ఉండటంవల్ల లభించే అనిర్వచనీయమైన ఆనందం."

"ఆ ఆనందం పురుషుడికే కాని. స్త్రీకి ఉండదుగా? మనస్సునూ, ఆత్మనూ, శరీరాన్నీ మగవానికి విక్రయించుకున్న బానిస మగువకు సుఖం ఎక్కడిది? స్వేఛ్ఛ ఎక్కడిది?"

"మగువ మగవానికి బానిసని ఎవరన్నారమ్మా?"

"వివాహ ధర్మం, ప్రకృతి ధర్మం అలానే ఘోషిస్తున్నాయి కదచే!"

"అవి ఎలా ఘోషించినా పురుషునికి తాను బానిస కావాలో, లేక పురుషుడు తనకే బానిస కావాలో తన శక్తి సామర్థ్యాల ద్వారా నిర్ణయించాల్సింది స్త్రీయేనమ్మా! ఉదాహరణకు మా రహీంను చూడండి. ఏనుగంత మనిషి. అయితేనేం, నే గీచిన గీటు దాటడు. ఏమంటాడో చూదామని ఒక నాటి అర్థరాత్రివేళ అదను కనిపెట్టి ఏనుగంబారీ తక్షణం ఎక్కించమని పట్టుబట్టాను. ఆ సమయంలో ఏనుగు తీసుకొనిరాలేని తన అసమర్థతకు వెయ్యి విధాల క్షమార్పణ చెప్పుకొని చివరికి తానే ఏనుగు ననుకోమని, తన భుజాలపైకి నన్నెక్కించుకొని వెన్నెలలో నాలుగు వీధులు తిరిగి వచ్చి నా మోజు తీర్చాడు."

"వాడో వెట్టి వెధవ" అంది రోషనార అపహాస్యాన్ని ధ్వనింప చేస్తూ.

"అలా అనకండి. కాబూల్ రణరంగంలో ఒంటి చేతిమీదిగా యాభై మందిని ఎదిరించి పాదుషా మన్ననలందుకున్న వీరాధి వీరుడు. అంతటి వాణ్ణికూడ వెట్టి వాణ్ణి చేయగల శక్తి నాకు ఉంది."

"జానాను. నీవు చాలా గొప్ప దానివి."

"నాకే కాదమ్మా. అ మాటకొస్తే ఆడువారందరికీ ఆ శక్తి ఉంది."

"అలాగా!"

"మీకు తెలియదు కాని, మీకోసం మీ పాదాలపై బడి ప్రాణార్పణ చేయని పురుషుడంటూ ఒకడు ఉంటాడా అని."

"ఛీ, పో- నోర్ముయ్" రోషనార కపోలాలు ఎఱ్ఱబడ్డాయ్. పెదవులు వణికాయి. కనులు నిప్పులను కురిపించాయి. జుమీలియా ముఖం ముడుచుకుంది. తల వంచుకుంది. జుమీలియా ఇంతకు ముందెన్నడూ రోషనారనే లక్షిస్తూ ఇలా అని ఎరుగదు. ఈరోజున ఎందుకు

అన్నానా అని బాధపడసాగింది. రోషనార కూడా జుమీలియా ఎంత ఆంతరంగికురాలైనా ఇంతచనువు తీసుకోవటాన్ని తాత్కాలి కోద్రేకంలో సహించలేకపోయింది. కాని, జుమీలియా వదనం చిన్నబోవటం గమనించిన ఆమె ఉద్రేకం ఉపశమించింది. అదీకాక జుమీలియా పలుకులు ఆమెలో క్రొత్త ఆలోచనలనురేపాయి. గతంలో అనేకులామెను అపురూప సౌందర్యవతిగా స్తుతించిన సన్నివేశాలు లేకపోలేదు. అయితే తాను అంతగా అందగత్తెను కానన్నే విషయం తెలిసిన రోషనార వారిని చూచి ఉదాసీనంగా నవ్వి ఊరుకునేది. కాని, ఈ జుమీలియా పలుకులు ఆమెకు తాను నిజంగా అందంగా ఉన్నానేమో అనే భావం కలిగించాయి. కాకుంటే తనకై ప్రాణార్పణ గావించే పురుషులుంటారని జుమీలియా అంటుందా?

"ఏమే, నేను నిజంగా అంత అందంగా ఉన్నానటే?" అంది రోషనార.

"మీరు అందంగా లేరని ఎవరన్నారమ్మా?"

"మా నాన్న నేను నల్లగా ఉన్నానని గేలి చేస్తుండేవాడు."

"షాజహాన్ పాదుషా వారా? ఆయనకు ఆ జహనారాబేగం అంటే వల్లమాలిన పక్షపాతం. అయినా, మీరు నలుపంటే నలుగురూ నవ్వుతారు. చక్కటి చామన ఛాయ. అందానికి రంగే అవసరమా? స్వర మాధుర్యంతో సార్వ జనీన గౌరవాన్ని అందుకున్న కోయిలకు నలుపు రంగు అడ్డువచ్చిందా? ఐశ్వర్యమూ, ఆభరణాలు, శక్తి సామర్థ్యాలూ, మేధస్సూ ఇవన్నీ అందాన్ని ద్విగుణీకృతం చేస్తాయి కదమ్మా!"

"అయితే, నేనూ అందంగానే ఉన్నానంటావ్?"

"అనుమానమా అమ్మా?"

"నన్ను ప్రేమించే వాళ్ళూ ఉన్నారంటావ్?"

"మిమ్మల్ని చూచి ఝుడిసి ఊరుకుంటున్నారు. కాని, లేకుంటేనా? రోషనార చరణ చక్రవర్తులు వేనకువేలు.... తమ అడుగులకు మడుగు లొత్తటానికి సిద్ధంగా ఉన్నారు."

"అలాంటి చక్రవర్తులే నా వద్దకు రావాలి కాని, వామపాద తాడనతో సన్మానించి పంపనటే!" రోషనార పెద్దగా నవ్వింది. ఆ నవ్వులో అహంభావమూ, అధికార గర్వమూ ప్రతిధ్వనించాయి.

ఆ వికట హాసానికి అంతటి సాన్నిహిత్యం కల జూమీలియా కూడ ఉలిక్కి పడింది. అంతలో బయట ఒక సన్నని ఈల వినిపించింది. ఆ మరుక్షణంలో కోలాహలం. ఆ వెంటనే కత్తులు ఖంగ్ ఖంగ్ మని మోగుతున్నాయి. 'చంపండి, నరకండి, మేనాను దోచుకోండి' అనే ధ్వనులతో పర్వత సానువులు ప్రతిధ్వనించసాగాయి. జూమీలియా ఆందోళనా కలితాంతరంగియై పరదాను తొలగించి వెలికి చూచింది. నల్లని దృఢకాయు లనేకులు బరిసెలు, గండ్రగొడ్డళ్ళు తీసుకొని తమ సేనపై తలపడుతున్నారు. ఎంత సుశిక్షితులైనా - మొగలాయి వీరుల సంఖ్యాబలం తక్కువ కావటంతో ఒక్కరొక్కరుగా నేల కొరుగు తున్నారు. క్షణాల మీద ఆ ప్రదేశమంతా రక్తపుమడుగులతో, ఖండితా వయవాలతో, శవాలతో, క్షతగాత్రులతో నిండిపోతున్నది. ఆ దృశ్యం చూడ లేక కెవ్వున కేక వేసి జూమీలియా తల వెనుకకు తీసుకొని పరదానుతటాలున మూసివేసింది. ఆ మరుక్షణంలోనే అంతవరకు ఎంతో ధైర్యంగా మేనాను భుజాలపై మోస్తున్న బోయీలు ధైర్యంతప్పి పరుగెత్తటం వల్ల మేనా తటాలున క్రింద పడింది. జూమీలియాకు మూర్ఛిల్లినంత పనై తెప్పరిల్లింది.

వికట మందహాసంతో "ఏమిటీ, అలా ఐపోయావ్?" అని ప్రశ్నించింది రోషనార.

"ఎవరో పిండారీలమ్మా!"

"అయితే?" తాపీగా ప్రశ్నించింది రోషనార. "ఈ మాత్రానికే భయపడుతారటే?"

రోషనార ఉదాశీనత చూచి జూమీలియా ఆశ్చర్యపోయింది. బయట అంత ప్రమాదం ముంచుకు వస్తుంటే ఏమిటీమె కింత నిశ్చింత? తనకొరకు ప్రాణాలొడ్డేవారనేకులు ఉన్నారనేనా ఈ ధైర్యం? కాని, వారుకూడ ఒక్కొక్కరుగా నేల కొరుగుతున్నారే- అనుకుంది జూమీలియా. "అదికాదమ్మా. శాత్రవబలం అధికంగా ఉంది".

"ఉండనీ - మనకు బుద్ధి బలం ఉందిగా?"

"వారు మూర్ఖులమ్మా!"

"మూర్ఖులముందు కాక మేధావులముందు బుద్ధి బలం అక్కరకు వస్తుందటే? నా దృష్టిలో అందరూ మూర్ఖులే."

ఆ సమయంలో బయటనున్న ఒక వ్యక్తి పరదా తొలగించాడు. వెంటనే రోషనార చెయ్యి పట్టుకుని "బయటికిరా" అని గర్జిస్తూ వెలికి లాగాడు. మందహాస చంద్రికలు పెదవులపై చిందిస్తూ మేనానుండి వెలువడింది రోషనార. తనపై అంత సాహసంచేసి ఎదురుగా సజీవంగా నిలచి ఉన్న వ్యక్తిని ఆపాదమస్తకం తిలకించింది. నల్ల పాలరాయిని బోలి నిగనిగ లాడుతున్న శరీరం ఆరడుగుల ఎత్తు, విశాలమైన ముఖం, మెలి తిరిగిన కండలు—కౌపీన మాత్ర వస్త్రధారియైన అతని సహజ సౌంద ర్యాన్ని ఇనుమడింపచేస్తున్నాయి.

"అందగాడివే! అడవినిగాంచిన వెన్నెలలో బ్రతుకుతున్నావ్" అంది రోషనార సోయగాన్ని ఒలకబోస్తూ. నిజానికామె అతణ్ణి లోలోన అసహ్యించుకుంటున్నది. అసలామెకు అందాన్ని కొలవటం తెలియదు. అనుభవించటం అంతకుముందే తెలియదు. కామం ఆమెకు కనుచూపు మేరలోకి రావటానికి కంపిస్తుంది. అయితే అవసరానికి కార్యసాధనా విశేషంగా కామాన్ని దగ్గరకు లాక్కొని కన్నులోంచి చిందిస్తుంది. అంతేకాని, ఆమె ఏనాడూ కామానికి దాసికాలేదు. అయితే ఆమె ప్రణయ ప్రదర్శనకు దాసుడు కానివాడు కూడా లేడు. ఆగంతుకుడు మాత్రం అందుకు విభిన్నంగా వ్యవహరించటం ఆమెకు ఆశ్చర్యం కలిగించింది.

"నీ అంద చందాల సంగతి నాకు తెలుసు. నాకు కావలసింది నీ బంగారుమేనా, నీ నగలు - అంతే. మర్యాదగా ఇచ్చి బయటపడు."

"నే నెవరో తెలుసా?"

"నీ వెవరైనా నా కొకటే."

"అది కాదోయీ - నేను అలంఘీర్ పాదుషావారి సోదరిని-రోషనారను."

"అలాగా-అయితే నిన్ను మీ అన్నదగ్గరికి తప్పకుండా పంపుతా."

"నిజంగా."

"అబద్ధం ఆడటానికి మేం పాదుషాలం కాదు. ఆయన మాకు, మా పల్లెకూ, పెళ్ళాం బిడ్డలకు చేసిన ద్రోహానికి ప్రత్యుపకారంగా నీ తల తీసి ఈ మేనాలోనే పెట్టి మీ అన్నకు పంపుతా."

"వీరుడా....!"

"నేను వీరుణ్ణి కాదు- హంతకుణ్ణి" అంటూ ఆ వ్యక్తి మారు మాటకవకాశం ఇవ్వకుండా తటాలున తన గండ్ర గొడ్డలిని పైకెత్తాడు.

తన వద్ద ఉన్న మహాస్త్రం ఆ విధంగా శక్తిరహితమై పోవటం చూచి ప్రాణరక్షణోపాయాన్ని అన్వేషిస్తూ రోషనార పరిసరాలను కలయచూచింది. అప్పటికే తమచుట్టూ వలయాకారంగా నిలచి ఉన్నారు అనాగరికులు. పారిపోయేమార్గం లేదు. నిరాశ చేసుకొని చివరి ప్రయత్నంగా "చూడు" అంది, తనను చంపటానికి గొడ్డలి ఎత్తిన వ్యక్తిని ఓరకంటచూస్తూ.

"చూడటానికి నాకు తీరిక లేదు. నీకూ, మీ అన్నకూ దేవుడు లేడనుకో. అయినా, అలవాటు ప్రకారం దైవప్రార్థన చేసుకోటానికి అవకాశ మిస్తున్నా - త్వరగా కానీ-" అన్నాడా వ్యక్తి.

"సరే, నాకు దేవుడులేడు. నిజమే. చంప తలుచుకుంటె చంపు. ఎలా చంపుతావో చూస్తాను" అంది రోషనార.

ఆ క్షణాన కూడ అంతటి నిబ్బరాన్ని ప్రదర్శిస్తున్న రోషనారను చూచి జుమీలియా ఆశ్చర్యపోయింది విషాదంలో.

"ఎలా చంపుతానా? ఇలా-" అంటూ ఆగంతుకుడు గండ్ర గొడ్డలిని ఒకసారి ఆమె మెడపై గురిచేసి పైకి ఎత్తాడు. మరుక్షణంలో సుదూరంనుండి శరవేగంతో వచ్చిన ఒక ఛూరిక అతడి మణిబంధంలో గుచ్చుకోకపోతే రోషనార అంతరించి ఉండేదే! వెంటనే 'అమ్మా' అంటూ గండ్ర గొడ్డలి వదిలి వేశాడు పిండారీయోధుడు. ఆ మరుక్షణం లోనే 'మరాఠీదండు, మరాఠీదండు' అనే కలకలం బయలుదేరింది పిండారీలలో.

అనతి క్షణాలల్లోనే మరాఠీదండు పిండారీలపై వచ్చిపడింది. రోషనార "అమ్మయ్యా" అని నిట్టూర్పు విడిచింది.

పిండారీలతో పోలిస్తే మరాఠీ దండు సంఖ్యా బలం అత్యల్పం. అయినా, దండుకు నాయకత్వం వహిస్తున్న ఒక హ్రస్వరూపుని పరాక్రమం, నాయకత్వపు ప్రజ్ఞ పిండారీలను ముప్పుతిప్పలు పెడుతున్నాయి.

గంధ గజరాజ బృందంపై లంఘించు మృగరాజులా ఆ మరాఠీ వీరుడు తన అశ్వాన్ని శాత్రవ నివహం పైకి దూకిస్తూ, అపూర్వ ఖడ్గ చాలనా నైపుణ్యంతో వేటు కొక తల చొప్పున బలిగొంటూ పిండారీలను

చిందర వందర చేయసాగాడు. అన్ని విధాలా అతడికి సరితూగ గలిగి నదే అతడి అనుచర బృందం. అనతికాలంలోనే అసంఖ్యాకులైన పిండారీలు పలాయన మంత్రం పఠించటం చూచి రోషనార ఆగంతుక వీరున్ని అభినందించకుండా ఉండలేక పోయింది లోలోన. ఎవరా! ఈ కొదమ సింగపు బిడ్డ— అని రెప్ప వాల్చకుండా అతనివంకే చూడ సాగింది. అతడు తన వంక చూడగానే చిరునవ్వుతో సమాశ్వాసించాలని వేగిరపడసాగింది. అంతలో సమీపాన ఉన్న తరుశాఖపై రెప రెప-టప టప మని సవ్వడి అయింది. ఏమిటా అది—అని అప్రయత్నంగానే ఆ వంక చూచింది రోషనార. రెండు కపోతాలు పైన క్రింద పడుతూ ఆడుకుంటూన్నాయి. 'ఛీ-పాడు. ఇక్కడింత రక్తపాతం జరిగినా తమకు పట్టనట్లు అలా అల్లరి చేస్తాయేం?' అనుకుంటూ తల త్రిప్పింది రోషనార.

ఎదురుగా కొద్ది కాలం క్రితం తన అసమాన పరాక్రమ విశేషంతో ముక్కడి మూకలను చీల్చి చెండాడిన యోధుడు అవనత శీర్షంతో వినమ్రుడై నిలచి ఉన్నాడు. ఎందుకో రోషనార గుండె ఝల్లుమంది. శరీరం జలదరించింది. మనసు రెక్కలు కట్టుకుని ఎగిరిపోతున్నదా అని పించసాగింది రోషనారకు. గుండె దిటవు చేసుకోవటానికి ఎంతగానో ప్రయత్నించింది—చేసుకోలేకపోయింది. ఎదురుగా ఉన్న వీరునిపై నుండి దృష్టి మరల్చుకోవాలని విశ్వప్రయత్నం చేసింది— మరల్చుకో లేకపోయింది. "ఎన్నడూ లేనిది ఏమిటిది-ఏమిటీమానసిక దౌర్బల్యం, నేను రోషనారనేనా?" తన్ను తాను బిగ్గరగా ప్రశ్నించుకుంది ప్రకంపిత గాత్రంతో.

"తల్లీ! అడుగకుండానే పేరు చెప్పినందుకు ధన్యుణ్ణి" అన్నాడు వీరుడు అవనత వదనంతోనే.

తల్లీ! ఏమిటీ వింత సంబోధన? తాను తల్లిలాగా ఉందా? అంత వయస్సు వచ్చిందా? అసంభవం. తనకు వయస్సు మించలేదు. మాతృత్వానికి ప్రాతిపదిక అయినా అనుభూతి అయినా పొందని, కనీసం వాంఛించని తనను తల్లీ అని పిలవటం ఎంత దుస్సాహసం అనుకుంది రోషనార.

"మొగలాయి సామ్రాజ్య రాజ్యాంగ యంత్రాంగాన్ని కను

సన్నుల నడిపిస్తున్న షాజాదీ రోషనార బేగం సాహెబా వారిని ముష్కరుల బారినుండి రక్షించే అదృష్టం నాకు కలిగించిన పరమేశ్వరునికి ప్రణామం చేస్తున్నాను"

'ఎంత చక్కగా మాట్లాడుతున్నాడు!' అనుకోకుండా ఉండలేక పోయింది రోషనార.

"అమ్మా!"

మళ్ళీ అదే సంబోధన! ఏమిటీ విపరీతం?- అనుకుంటూ రోషనార "వీరుడా! నేను అమ్మను కాదు- అవివాహితను" అంది. తన పలుకులో చిందిన వలపు తేనెయకు తానే ఆశ్చర్యపోయింది మరుక్షణంలో. వివాహ ప్రస్తావన ఎందుకు తెచ్చానా అని నాల్క కరుచుకోకపోలేదు కూడా.

"నిజదారలు తప్ప పర స్త్రీలంతా నాకు మాతృసమానులేనమ్మా!" అన్నాడు వీరుడు దృఢచిత్తంతో.

రోషనార ఆ వీరుని వంక చూచింది పరిశీలనగా. నిశ్చలంగా ఉన్నాడు. వంచిన తల అలానే ఉంది. పోతపోసిన కాంస్య విగ్రహంలా ఉన్న అతని మూర్తి, అతని దృఢచిత్తానికి నిదర్శనమేమో అనుకుంది. తనంతటి వ్యక్తి, కట్టెదుట నిలిస్తే కన్నెత్తి చూడని ఈ వీరుని అహంభావమేమిటా అనుకొని "అలాగా!" అంది లాలనగా.

"అంతేకదమ్మా! తమకు తెలియని ధర్మాలు ఉన్నాయా? తల్లీ! క్రూరమృగాలతో, దోపిడి మూకలతో, దుర్గమారణ్యాలతో భయంకరంగా ఉన్న ఈ వింధ్య పర్వత ప్రాంతాలకు అల్ప పరివారంతో రావటంలో పొరపాటు చేశారు. దయామయుడైన పరమాత్మ మిమ్ములను రక్షించాడు. నా పరిజనం మీ సిగలో పూవు వాడకుండా మీరు కోరిన స్థలానికి చేర్చి వస్తారు" అన్నాడు వీరుడు.

"మంచిది వీరుడా! నాకు మేలుచేసి మొగలాయి ప్రభువు ఎడల నీ విధ్యుక్త ధర్మం నెరవేర్చుకున్నందుకు సంతోషం. నీ ప్రభుభక్తి ప్రశంసనీయం."

"క్షమించండి. మొగలాయి పాదుషా నాకు ప్రభువు కాదు. అందువల్ల ప్రభుభక్తి ప్రశ్న లేనే లేదు. ఆపదలో ఉన్నవారిని-

అందులో అబలలను రక్షించటంలో నా విద్యుక్తధర్మాన్ని నేను నెర వేర్చుకున్నాను"

"అలాగా! నీవు రాజద్రోహివా?"

"నేను రాజద్రోహిని కావటం ఈ జన్మ కసంభవం. మహా యితే ప్రజాద్రోహిని ఔతానేమో ఏనాటికైనా"

"సరే. వీరుడా! తర తమ భేదాలు పాటింపక నీతో ఇంతసేపు ప్రసంగించటం నాదే పొరపాటు. ఇంతకూ నీ పేరు?"

"పేరు చెప్పటం అలవాటు లేదు తల్లీ! నన్ను బిడ్డా అని పిలు. సంతోషించి బదులు పలుకుతాను—కాలాతీతమైంది. తల్లీ! నాకు సెలవు. నా అనుచరులు తమ గమ్యస్థానం వరకూ వెంట వస్తారు" అంటూ వీరుడు తన పంచకళ్యాణి అశ్వాన్ని అధిరోహించి తృటి కాలంలో దక్షిణాభిముఖుడై అదృశ్యుడై పోయాడు.

వీరుడు వెళ్ళిన వంకే రెప్పవాల్చకుండా చూస్తున్నది రోషనార. అలా ఎంతకాలం గడిచిందో ఆమెకు గమనం లేదు. "అమ్మా! మేనా సిద్ధంగా ఉంది. బయలుదేరుదామా?" అన్న జుమీలియా పలుకులు విని ఉలిక్కిపడిన రోషనార "ఔనౌను-పదవే" అంటూ మేనా వైపు నడిచింది.

మరి కొద్దిక్షణాల తరువాత బంగారు మేనా పైకి లేచి ముందుకు సాగింది.

'ఒహోం-ఒహోం, ఓం....ఒహోం-ఒహోం హోం....'

# 2

ప్రస్తుత కథా కాలానికి మొగలాయి సామ్రాజ్యాధినేత ఔరంగజేబ్ తన తండ్రి షాజహాన్ పాదుషా వారిని చెరలో బంధించి, హిందూ ధర్మాభిమాని అయిన అగ్రజుడు దారాను సింహాసనాని కనర్హుడని వధించి, అన్న సూజాను. తమ్ముడు మురాద్‌ను దారాకు తోడుగా పంపించి తానే రాజ్యాధిపత్యం వహించాడు—ఇస్లాం ధర్మసంరక్షణార్థం. సింహాసనాని

కడ్డువచ్చిన ప్రతి వ్యక్తినీ ప్రపంచంనుండి శాశ్వతంగా తొలగించి రాజరికపు మార్గాన్ని నిష్కంటకంగా చేసుకోవటంలో అతనికి చేదోడు వాదోడుగా నిలచి, చివరి కాతనిని మొగలాయి సామ్రాజ్య సింహపీఠికాధినాథుని చేసిన ఘనత రోషనారది.

రోషనార ఔరంగజేబ్‌ను ఎంచుకుంది కాబట్టి అతడు సింహాసనం అధిష్టించాడు. ఒకవేళ ఆమె దారానే ఎన్నిక చేస్తే, వెయ్యి మంది ఔరంగజేబ్‌లు కలసి వచ్చినా దారాయే సార్వభౌముడయ్యేవాడు. ఇది వాస్తవం. ఈ వాస్తవాన్ని సంపూర్ణంగా గుర్తించినవాడు ఔరంగజేబ్. అందువల్లనే ఆంతర్యంలో అతడికి ఆమె అంటే ఎనలేని భయం లేకపోలేదు. అయితే ఆ భయాన్నే బాహ్యంగా 'సోదరీ' అనే ఆప్యాయత ధ్వనించే పిలుపులో ప్రదర్శిస్తాడు.

రోషనార ఒక మహత్తర చారిత్రక వ్యక్తి. చరిత్రగతినే మార్చి వేసిన ఘటనా ఘటన సమర్థ. మొగలాయి సామ్రాజ్య యంత్రాంగం అంతా ఆమె కనుసన్నల మెలగుతున్నది. అల్లంతదూరాన ఆవిడను చూడగానే యావద్భారత జాతి వంగి వంగి సలాంలు చేస్తుంది. ఆమె వస్తున్న సవ్వడి వింటే నిజానికి సార్వభౌముని నుండి సామాన్యుని వరకూ అందరికీ హడలే.

చాలవరకూ తనది కారణజన్మమనే అహంభావం ఉంది రోషనారకు మొదట్లో. భారతావనిని ఇస్లాని దేశంగా రూపొందించే నిమిత్తమే, ఇస్లాం ధర్మ సంస్థాపనార్థమే తాను అవతరించాననే అహంభావం ఉంది. ఆ ఆశయాని కనుగుణంగానే మత సహనానికి అలవాటుపడిన ఇతర సోదరులను కాదని, ఇస్లాం ధర్మాన్ని అనుసరిస్తున్న ఔరంగజేబ్‌నే సార్వభౌముని చేయ సంకల్పించింది.

ఈ సంకల్పసిద్ధి కొరకు ఆమె చేయరాని పనులెన్నో చేయవలసి వచ్చింది....బంధుప్రీతిని, రక్తసంబంధాలను తెగనాడింది. మనసును కఠిన పాషాణ సదృశం చేసుకుంది. అంతరాత్మను అణచివేసుకుంది. రుధిరవాహినులలో తేలియాడింది. చేపట్టిన ప్రతికార్యంలోనూ, వేసిన ప్రతి ఎత్తుగడలోనూ విజయం సాధించింది. అయితే— ప్రతిసారీ దుర్మార్గాన్నే ఆమె అనుసరించవలసి వచ్చింది. తాను చేస్తున్నది దైవ ద్రోహమని తెలుసు. అన్న దారాను వధించటం, మురాద్‌పై విష

ప్రయోగం చేయటం, అర్ధరాత్రి వేళ సూజాను హత్య చేయించటం, కన్నతండ్రి షాజహాన్ పాదుషాకు ఆజన్మఖైదు విధించటం అన్నీ అన్యాయాలే, అక్రమాలే, అల్లాకు ఆగ్రహ కారణాలే.... అయితే, అల్లా ఎందుకు ఉదాసీనత వహించాడు? పరమాత్మ వచనమైన ఖురాన్‌కు వ్యతిరేకంగా తాను వ్యవహరిస్తూ ఉంటే అల్లా ఎందుకు ఊరుకున్నాడు? పైగా-ప్రతి అక్రమ కార్యంలోనూ తనకే ఎందుకు విజయం ప్రసాదిస్తున్నాడు? అసలు అల్లా అంటూ ఒక్క శక్తి ఉందా? ఉంటే- అసత్య విజయాన్ని ఆశీర్వదించే ఆ శక్తికి ఔన్నత్యం ఆపాదించవచ్చా?

ఎడతెగని అనుమానంతో, సమాధానం లేని ప్రశ్నతో రోషనార చాల కాలం సతమతమైంది. ఆలోచించిన కొద్దీ మనస్సు వికలం కావటం తప్ప సమస్య జటిలం అవుతోంది. సమాధానం అంతుచిక్కటం లేదు. నిద్రలేదు. ఆహారం లేదు. ఒకటే ఆలోచన. ఆద్యంతాలు లేని ఆలోచన. సిద్ధాంతాన్ని చేరుకోలేని తర్కం. రోజులు, నెలలు, సంవత్సరాలు గడిచిపోయాయి. ఆమెలో మానసిక శాంతి అంతరించింది. మనిషి చిక్కిపోయింది. శిరోభారంతో వెంట్రుకలు రాలిపోసాగాయి. చివరికి ఒకనాడు 'దేవుడే లేడనుకుంటే?' అనుకుంది. మరుక్షణంలో ఎంతో సంతృప్తిగా నిట్టూర్చింది. హృదయం ఎంతో తేలికపడింది. మనోవేదన అదృశ్యమైంది. శిరోభారం మాయమైంది. నవోల్లాసం అంకురించింది. ఔను- దేవుడు లేడు. ప్రతివారు, ప్రతి మతానికి చెందినవారూ దేవుణ్ణి తమ స్వార్థానికి ఒక ముసుగుగా మాత్రమే ఉపయోగిస్తున్నారు. అంతే! నిజంగా దైవమనే శక్తి అంటూ ఒకటి లేదు. ఉన్నది స్వార్థం ఒక్కటే. ఆ స్వార్థాన్ని సమర్థించుకోవటానికి దైవం కేవలం ఒక పరికరం మాత్రమే. ఇక దైవమే లేనప్పుడు- అతణ్ణి ఆశ్రయించుకుని ఉన్న మతాలన్నీ సర్వాబద్ధం. ఇది నిజం-ఇది నిజం అనుకుంది రోషనార.

ఆనాటి నుండీ ఆమె జీవిత విధానమే మారిపోయింది. ఎవరైనా దైవం పేరెత్తినా, మతం మాట ప్రస్తావించినా వికటాట్టహాసం చేసేది. ఒకనాడు ఆ వికృత హాసానికి చండశాసనుడైన ఔరంగజేబ్ అంతటి వాడు హడలిపోయాడు. "ఏమిటిది సోదరీ!" అన్నాడు దీనంగా.

"భయ్యా! నీ హృదయానికి నీకు, నా హృదయానికి నాకు మనం మహా పాపులమని తెలుసు. పాప పుణ్యాలు విచారించే పరమాత్మ

డంటూ ఒకడు ఉంటే ప్రాయశ్చిత్తం కూడా లేని పాపాలు చేసిన మనను క్షమించడు. అఖిలైశ్వర్యాలతో, అనంతాధికారంతో ఆశీర్వదించడు. అందుకని పరమాత్ముడనే వాడు లేనే లేడు. ఇది స్వానుభవంతో కనుగొన్న ప్రత్యక్ష సత్యం. ఇక దైవమంటావా? అధికారమే దైవం. అధికారంలో ఉన్నవారు పాపాలు చేసినా పుణ్యాలుగానే చలామణి కావటమే అందుకు కారణం. ఇక అధికారమంటావా- తత్సాధనకు యుక్తాయుక్త విచక్షణా రహితమైన స్వార్థమే మార్గం. స్వార్థమే దైవం. ఏమంటావ్?" అని రెట్టించింది.

చివరికి ఒక విధంగా ఒప్పించింది కూడ.

రోషనార అంత అందగత్తె కాదు. ఆ మాట కొస్తే ఆమెలో స్త్రీత్వం కన్నా పుంస్త్వమే మెండేమో అనిపిస్తుంటుది. యౌవ్వనం ప్రసాదించిన బిగి మినహా మరే సౌందర్యమూ ఆమె సొత్తు కాదు. చిన్ననాటి నుండీ కర్తవ్యనిష్ఠలో నిమగ్న కావటంచేత శారీరక సుఖాలాలసత ఆమెను సమీపించలేకపోయింది. స్త్రీ సహజమైన వాంఛలు ఆమెలో చివురించజాలక పోయాయి. అసమాన రాజకీయ దురంధరిణైన ఆమె పలుకు దారుణా ఖండల శస్త్ర తుల్యము. చూపు బడబాగ్ని జ్వాల.మనసు కఠిన పాషాణ సదృశము.

* * *

ఆగ్రా నగరపు కోటగోడల లోపలగల ఉద్యానవనంలో రోషనార తదేకంగా తరుశాఖపై ఉన్న లక్ష్యాన్ని అనిమిష నయనాలతో అవలోకిస్తున్నది. అలా ఎంతసేపుగా చూస్తున్నదో కాని, వెనుకనుండి మంజులంగా 'బేగం సాహేబా' అనే పదాలు వినేసరికి ఒక్కసారిగా ఉలిక్కిపడింది. తన్ను తాను సమ్మాళించుకుని వెనుతిరిగి చూసింది. 'జుమీలియా' పెదవులు కదిలాయి. కాని, స్వరం వెలువడలేదు. జుమీలియా 'సఖీ' అనబోయింది. 'ఇశ్' ముక్కుపై వ్రేలుంచి మాటాడవలదని సూచించింది రోషనార. ఆ వెంటనే విల్లమ్ములు కొనిరమ్మని సైగచేసి మళ్ళీ దృష్టిని లక్ష్యంపైపు కేంద్రీకరించింది.

యజమానురాలి ఆదేశం అందుకున్న జుమీలియా అనతికాలంలోనే విల్లమ్ములతో రోషనారను తిరిగి సమీపించింది. నెమ్మదిగా లయగులో అడుగులు వేసుకుంటూ, దృఢహస్తాలతో రోషనార విల్లు చేతి

నుండి విల్లునూ, అమ్ము నూ అందుకుంది. ఆ తరువాత లక్ష్యం వంక బాణం ఎక్కుపెట్టి నారిని ఆకర్ణాంతం లాగింది. అమ్ము కన్నా వాడియైన దక్షిణ నేత్రంతో గురిని సరిచూచి రెండు అమ్ములను ఒక్కసారిగా వదలింది. లక్ష్యం తప్పటం అలవాటులేని విషయం కావటంవల్ల ఆ తరువాత విల్లును నిర్లక్ష్యంగా జూలియా చేతిలోకి విసిరివేసింది. అంతా క్షణకాలంలో జరిగిపోయింది.

అంతకన్నా ఆశ్చర్యమేమిటంటే అలవాటులేని విధంగానే లక్ష్యం తప్పింది. సమీపిస్తున్న శరద్వయాన్ని పసిగట్టి ద్విగుణీకృత శరవేగంతో కొమ్మపైనున్న పావురాల జంట రివ్వున వినువీధి కెగిరింది. ఈ విషయం గమనించిన రోషనార కనులవెంట మంటలు క్రక్కింది. అయితే ఆకసంలో చక్రాలు కొడుతున్న కపోత ద్వయాన్ని ఆ జ్వాలలు ఏమీ చేయలేకపోయాయి.

"ఎంత అవమానం? రోషనార మరణించమని శాసించినా బ్రతకటానికి సాహసిస్తాయా ఈ పావురాలు?" పళ్ళు పటపట కొరికింది రోషనార.

"ఎందుకమ్మా, సాధుసంతతి పైన అకారణమైన ఈ ఆగ్రహం" అంది జూలియా.

"అకారణం కాదే, సకారణమే. నీకు తెలియదు కాని, ఈ పావురాలు ఎక్కడ కనిపిస్తే అక్కడ నా మనస్సును మథించి వేస్తున్నాయి. వాటిని చూడగానే ఏవేవో పిచ్చి పిచ్చి ఆలోచనలు, కోరికలు నా హృదయంలో ఆవిర్భవించి అల్లకల్లోలం చేస్తున్నాయి. వాటిని చూచిన క్షణాన మనసు మనసులో ఉండదు. రెక్కలు కట్టుకుని ఎక్కడికో ఎగిరిపోతుందా అనిపిస్తుంది. అర్థంకాని ఆరాటంతో హృదయం కొట్టుమిట్టాడుతుంది. చండశాసని అయిన రోషనార నేనా, లేక మరొకరిగా మారిపోతున్నానా—అన్న అనుమానం పెనుభూతమై వెంటపడుతుంది"

"ఏమిటమ్మా! నాకేమీ అర్థం కావటం లేదు" అంది జూలియా అమాయకంగా. నిజానికి ఈ వ్యవహారంలో ఆమె కర్థం కానిదేమీలేదు. అయినా చేస్తున్నది రాజసేవ కాబట్టి, అర్థమైందని అంటే ఏ ప్రమాదం ముంచుకు వస్తుందో అని ఆమె భయం.

"జానే, అర్థం కాకుండటమే మంచిది. నా అంతఃపురంలో ఎక్కడా పావురాలు కనిపించరాదని నా మాటగా ఖోజాలకాజ్ఞాపించు"

"అలాగేనమ్మా! కాని, అవేం దోషం చేశాయమ్మా?"

"నా కంట పడటమే అవి చేసే దోషం" రోషనార నీరసంగా నిట్టూర్చింది.

"ఏమిటమ్మా ఈ వికారం?"

"వికారం కాదే! అవి కళ్ళపడిన మరుక్షణంలో ఒక ఆకారం నా కళ్ళముందు మెదులుతుందే! ఆ ఆకారం చూచిన మరుక్షణంలో మనసు కట్లు త్రెంచుకుని అతని వైపు ఉరకలువేస్తూ పరుగులుతీస్తుంది. ఎందుకో ఎంత ఆలోచించినా అర్థం కాదు. కనుల ముందునుండి ఆ ఆకారాన్ని చెరిపివేయాలని ఎంత ప్రయత్నించినా సాధ్యంకాదు. ప్రపంచంలోని సమస్త చరాచర ప్రకృతినీ తిలకించినా చలించని నా కఠిన హృదయం ఆ ఆకారాన్ని చూడగానే నవనీతమై పోతుంది. నేను నేను కాక సామాన్య స్త్రీ స్థాయికి దిగజారుతున్నానేమో అనిపిస్తుంది"

"ఎవరమ్మా ఆ అదృష్ట జాతకుడు" జుమీలియా తెగించి ప్రశ్నించింది.

"నీ వనుకున్నట్లు అతడు అదృష్ట జాతకుడు కాడు, కాజాలడు. అతణ్ణి నేను ప్రేమించటం లేదు. పైగా నా మనసుతో, హృదయంతో చెలగాట లాడటానికి సాహసించిన ఆ దురదృష్ట జాతకుడు అనతికాలంలోనే కాలగర్భంలో కలసిపోతాడు. ఇది రోషనార అప్రతిహత కఠోర శాసనం. దీనికి తిరుగు లేదు" రోషనార ముఖం ఎర్రబారింది.

"పోనీ, ఆ దురదృష్ట జాతకుడెవరమ్మా?" ఉత్సుకతను ఆపుకోలేక ప్రశ్నించింది జుమీలియా.

"అతడా- అతడు....అతణ్ణి ఆనాడు నీవు చూడలేదటే? వింధ్య పర్వత ప్రాంతంలో షాజాదీ రోషనార బేగం అంతటి దాన్ని పొరపాటునో, గ్రహపాటునో, ప్రమాదవశాత్తో— ప్రమాదంనుండి రక్షించగలిగాననే అహంభావంతో షాజాదీ అభినందనలను అందుకోకుండానే మరలి వెళ్ళిన అదృష్టహీనుడు".

"అతడా? ఔను. నిజంగా అదృష్టహీనుడే"

"అతడెవరో నీకు తెలుసటే?"

"ఎక్కడో చూచినట్లుంది. కాని, ఖచ్చితంగా చెప్పలేనమ్మా!"

"నేనూ అంతకుముందు ఎక్కడో చూచినట్లే ఉంది."

"బయలుదేరమని ఆజ్ఞా?" సాభిప్రాయంగా ప్రశ్నించింది జూమిలియా.

"ఎక్కడికి?"

"అదే, ఆ వీరుని ఎక్కడ ఉన్నా వెతికి పట్టుకుని తమ ముందు నిలపటానికి" జూమీలియా పెదవులపై హాసరేఖ లంకురించాయి.

"ఏమిటే నీ వనేది?"

"అదేనమ్మా. నాకు తెలుసు లెండి. ఆ అదృష్టహీనుణ్ణి అందల మెక్కించి రెండవ కంట పడకుండా పరదాల మాటున తమ అంతః పురం చేర్చమంటారా?—అని"

రోషనారలో రోషం పెల్లుబికింది. రోష కషాయిత నేత్రాలతో జూమీలియావంక చురచుర చూస్తూ "జూమీలియా! ఈ మాటలన్నది నీవు కాబట్టి సరిపోయింది. పరిహాసానికైనా మరొకరిలాంటి పలుకు పలికితే వారి శరీరాలను ఖండ ఖండాలు చేసి కాకులకూ, గ్రద్దలకూ విసరి వేయించి ఉండేదాన్ని. జాగ్రత్త. అంత స్తెరిగి మసలుకో" గర్జించింది రోషనార. భయంతో గజగజ వణకుతూ తల వంచుకుంది జూమీలియా. తన ఊహాశక్తి ఈ విధంగా పరిణమించిందేమో అనుకుంటూ కనుల వెంట కన్నీళ్ళు జలజలా రాల్చింది.

"జూమీ! నీ మీద ఉన్న వాత్సల్యం కొద్దీ నీకూ, రహీంకూ శారీరక సంబంధాన్ని కూడ సహించాను. నా వాత్సల్యాన్ని అపార్థం చేసుకుని నన్ను కూడ నీలాంటి సామాన్య స్త్రీగా భావించావు. పొరపాటు చేశావ్! మరెప్పుడూ పొరపడకు. పద పోదాం" అంటూ దారితీసింది రోషనార. ఆమె ననుసరించింది జూమీలియా.

ఒకరితో ఒకరు మాటాడకుండా, ఎవరి మనోభావాలతో వారే సతమతమౌతూ లతా నికుంజాల మధ్యనుండి కొంతదూరం సాగిపోయారు వారిరువురూ. అంతలో రోషనార తటాలున ఆగిపోయింది. జూమీలియాకు అప్రయత్నంగానే అడుగు ముందుకు పడలేదు. ఇరువురూ చెవులు రిక్కించి పొదరింటి మాటునుండి వెలువడుతున్న పలుకు

లాలించసాగారు. ఒక్కొక్క మాట, రోషనార శ్రవణేంద్రిలోనికొక్కొక్క బల్లెపు పోటుగా తాకసాగింది.

"నీ అందం చూస్తే నాకు విచారం వేస్తున్నది" అని స్త్రీ స్వరం.

"అబద్ధం" అని పురుషకంఠం.

"అబద్ధం కాదు, నిజం. నా హృదయం పలుకుతున్న వాస్తవం"

"అందాన్ని చూచి ఆనందిస్తారు కాని, విచారపడతారా షాజాదీ"

షాజాదీ అన్నమాట చెవి సోకగానే ఉలిక్కిపడింది రోషనార. ఎవరీ షాజాదీ? తన అక్క జహనారా కాదు కదా! అసంభవం! అను కోవటానికి కూడ వీలులేని విషయం— మరి ఎవరీ షాజాదీ- దారా కూతురా? ఉహూ. ఆమె యింతకు తెగించదు. మరి ఔరంగజేబ్ కూతురా? పట్టుమని పధ్నాలుగు సంవత్సరాలు లేవు. కంఠస్వరాన్ని గుర్తించటానికి ప్రయత్నిస్తూ ఆలోచనలో పడింది రోషనార.

"నిజమే. అందం ఆనందానికి ఆలవాలం. సర్వసాధారణంగా, అనుభవైకవేద్యం. కాని, నీ అందం అడవి గాచిన వెన్నెల".

"మగవాడి అందం ఒక విధంగా చూస్తే అడవిగాచిన వెన్నెలే"

"అందరి మగవారి అందమూ అలా కాదు. మగవానికి అందం చేకూర్చేది మగసిరి. కాని, నీ విషయంలో నీ మగసిరి పూచిన సంపెంగ పొలపు పంటిది"

"నాకు కవిత్వం రాదు షాజాదీ"

"మరేం కాదు. సంపెంగ ఘుమ ఘుమలు భ్రమర కన్నియకు అనుభవయోగ్యం కాదు. అలాగే నీ అందం ఆడువారి అనుభవానికి కొరగానిది కదా, అని విచారిస్తున్నాను ఖోజా. నిన్ను చూచిన వారెవరూ ఖోజా వనుకోరు. కాని, ఖోజావు. అది నా దురదృష్టం."

రోషనార ఇకపై వారి సంభాషణ ఆలించలేక పోయింది. పళ్ళు పటపట కొరుకుతూ లతానికుంజాన్ని చుట్టి వెళ్ళింది. అక్కడామెకు కనిపించిన దృశ్యం - షాజాదీ ఫక్రున్నీసా బేగం అర్ధనగ్నంగా అంతఃపురపు మూడవ ఖోజా వడిలో వయ్యారంగా శయనించి—అధరాన్ని అందిస్తూ అంతతోనే తృప్తి పడుతున్నది.

మృత్యుదేవతలా కట్టెదుట సాక్షాత్కరించిన మేనత్త రోషనారా బేగంను చూచి ఫక్రున్నీసా బేగం హఠాత్తుగా ఖోజా వడినుండి లేచి

కూర్చొని మేలి ముసుగు సవరించుకుంది. ఖోజా గజగజలాడుతూ లేచి మంచానికి తలవంచాడు.

"ఫకృన్నీసా! రోషనార అంతటిదాని అన్న ఔరంగజేబు కడుపున చెడపుట్టావ్. అంత ఆరాటంగా ఉంటే పెళ్ళిచేయమని అడిగితే కాదన్నామా? పుంస్త్వంలేని ఖోజాతో ప్రణయ కలాపం నడిపి మానసిక సంతృప్తిపొందటం మన వంశానికి గౌరవమా? ఛీ ఛీ. వెళ్ళు, దూరంగా వెళ్ళు. నా కంటికి కనిపించకుండా దూరంగా పో" అంటూ గర్జించింది రోషనార.

ప్రచండ రూపం దాల్చిన మేనత్తవంక చూడటానికికూడ ధైర్యం చాలని పదునాలుగేండ్ల పడుచు ఫకృన్నీసా సిగ్గున తలవంచి, తడబడే అడుగులతో తరలిపోయింది. ఆమె దూరమైపోయే వరకూ ఆ వంక చూచి, ఆ తరువాత ఖోజా వంక తిరిగింది రోషనార.

"ఇలా రా"

ఖోజా తలవంచుకొని రోషనారను సమీపించాడు.

"నీ చేతిలోని కమ్చీ ఇలా ఇవ్వు" అంటూ అతని చేతిలోని కంచీని తీసికొని, "అంగరఖా తొలగించి వెనుతిరుగు" అని శాసించింది రోషనార. అతను మారు మాట చెప్పకుండా ఆమె ఆజ్ఞ పాలించాడు.

"హుఁ! మూర్ఖుడా! తరతమ భేదం లేక షాజాదీతోనా ప్రణయ కలాపాలు. నీచుడా! మగతనం లోపించినా మగతనపు కోరికలు మాత్రం అలానే ఉన్నాయిరా తుచ్ఛుడా?" అంటూ రోషనార తన చేతనున్న కంచీతో నిర్విరామంగా మోదసాగింది. ఖోజా సల్లెత్తు ప్రతిఘటన లేకుండా దెబ్బలన్నీ భరిస్తున్నాడు. అతడి మౌనం చూచిన రోషనార మరీ రెచ్చిపోయి కొడుతున్నది. ఖోజా వీపంతా ఎఱ్ఱగా పొంగింది. చారలు చారలుగా గాయపడి వీపుపై నుండి రక్తం ధారలుగా ప్రవహించ సాగింది. చివరికి ఖోజా ఆ బాధ భరించలేక నేల కొరిగాడు. కళ్ళు తేల వేసి దీనంగా చూచాడు రోషనార వంక.

"ఇకనైనా బుద్ధి వచ్చిందా?" కఠోరంగా ప్రశ్నించింది రోషనార.

అతని ముఖంలో ఏ విధమైన మార్పులేదు. "రాకేం చేస్తుంది?" అంటూ రోషనార క్రిందపడి ఉన్న అతడి శరీరం మీదిగా నడిచివెళ్ళింది.

ఆమెతోపాటు ఆమె వెళ్ళిన దెస తిరిగింది ఖోజా ముఖం. తృటికాలం ఆ ముఖంపై హాస రేఖ గోచరించి అదృశ్యమైంది.

ఆ నాటి రేయి ప్రథమ యామం గడిచింది. ద్వితీయ యామం ప్రవేశించింది. ఆగ్రా కోట మాటు మణగింది. దూరాన ప్రవహిస్తున్న యమునా తరంగిణి హోరు, కోటగోడలపై కావలా సిపాయిలు చేస్తున్న హెచ్చరికలు, విచ్చుకత్తులతో గస్తీతిరుగుతున్న అంతఃపురఖోజాల అడుగులసవ్వడి, కీయను కీచు రాళ్ళ ధ్వని మినహా రాత్రి సమయపు నిశ్శబ్దం గాంభీర్యతకు గల అవరోధాలన్నీ అణగారి పోయాయి. అంత వరకూ వేలాది సంఖ్యలో వెలుగుతూ, అంతఃపుర భవనాలను దేదీప్యమానంగా వెలుగొంద జేసిన క్రొవ్వువత్తి దీపాలన్నీ ఆరిపోయాయి. రోషనార బేగం శయ్యాగారంలో మాత్రం ఇంకా దీపాలు వెలుగుతూనే ఉన్నాయి.

ఎంత ప్రయత్నించినా ఆ నాడు రోషనారకు నిద్ర రావటం లేదు. హ్రస్వవీరుడా నాడామె దృష్టి పథంలో తిష్టవేశాడు. కనులు మూసినా, కనులుతెరిచినా అతని రూపమే. ఆమె కర్థం కావటంలేదు.... ఏమిటి అతనికీ తనకూ ఉన్న సంబంధం? ఒకనాడు అతను దోపిడిదారుల బాధ నుండి తప్పించాడు. ఆ ప్రయత్నంలో అతడు అసమాన సాహసం ప్రదర్శించాడు.అంటే, అంతమాత్రాన అతడికి తన కనుల ముందు సదా కదలియాడే హక్కు ఎక్కడినుండి ఎలా వచ్చింది? ఒకవేళ తానతనిని నిజంగా ప్రేమించిందా? ఛీ ఛీ. అసంభవం. రోషనార కేవలం ఒక పురుషునికి క్రింది కావటమా? బానిసకావటమా? ఈ ఊహే భరించరానిది. మరి—ఎంత ఆలోచించినా అవగాహనకాని సమస్యగా పరిణమించింది.

"జుమీ! శిరోభారం అధికంగా ఉంది. ఆలోచనాభారంతో మనసు వేడెక్కింది. పాత్రను కాశ్మీర మధువుతో నింపి పెదవులకు అందీయవే" అంటూ రోషనార తల్పానికి జేరగిల పడింది.

జుమీలియా వెంటనే బల్లపై ఉన్న పచ్చల పానపాత్రను మధువుతో నింపి రోషనార పెదవులకందించింది. రోషనార క్షణ కాలంలో పాత్రను ఖాళీచేసి "ఏమిటి మధువు చేదుగా ఉందేమే?" అంటూ పాత్రను విసిరివేసింది.

"మనసు మనసులో లేనప్పుడు మధువు చేదుగానే ఉంటుం దమ్మా."

"నీవు అప్పుడప్పుడు నిజం చెప్తుతుంటావ్ సుమా. మనసు మనసులోకి తెచ్చుకుంటాను. కాకుంటే మైకంలో మనసునే మరచిపోతాను. మరో పాత్ర అందీయవే."

"అలాగేనమ్మా" అంటూ జుమీలియా క్రిందపడిన పానపాత్ర నెత్తబోయింది.

"ఛీ! క్రింద ఉమిసిన ఉచ్ఛిష్టాన్ని తిరిగి భుజిస్తామటే? అంగిట ఉన్న మధువును మరల పుక్కిలించి మ్రింగుతామటే? మధువును నూతన పాత్రలో నింపి ఇవ్వవే."

"అలాగే షాజాదీ" అంటూ జుమీలియా మరో పాత్రను మధువుతో నింపి రోషనార కందించింది. లిప్తకాలంలో ఆ పాత్రనూ ఖాళీచేసి విసిరివేసింది రోషనార.

"కొంచెం వగరుగా ఉన్నా మధురంగానే ఉంది మధువు. మనసును మర్చిపోవటానికి అట్టే కాలం పట్టదు. మరో పాత్ర...."

జుమీలియా పాత్ర వెనుక పాత్రగా అనేకపాత్రలందించింది. రోషనార ప్రతి పాత్రనూ ఖాళీచేసి దూరంగా విసిరివేసింది.

ఇలా ద్వితీయ యామం గతించింది. తృతీయ యామం ప్రవేశించింది. రోషనార మైకంతో తూలిపోతున్నది.

"జుమీ! ఇక చాలు. నన్ను నేను మరచిపోయే స్థితి వస్తున్నది. ఎందుకో కాని, శరీరమంతా దిగచెమటలు పోస్తున్నది. అంతఃపురంలోని దీపాలు ఆర్పి నా అలంకరణ వస్త్రాలు తొలగించి వెళ్ళి పడుకో" అంటూ రోషనార శయ్యపై వ్రాలిపోయింది మత్తుగా.

యజమానురాలి ఆజ్ఞప్రకారం జుమీలియా ఆరామంలోని దీపాలను ఒక్కటి మినహాగా ఆర్పి, షాజాదీ అలంకార దుస్తులను విప్పి పడుకోవటానికి వెళ్ళిపోయింది.

క్షణం వెనుక క్షణంగా, గడియవెనుక గడియగా కాలం పరువెత్తసాగింది. రోషనార గాఢ నిద్రలో మైమరచి పోయింది.

# 3

రేయి మూడవ యామం గడిచి నాల్గవ యామం ప్రవేశించింది. ప్రకృతి ప్రశాంతంగా వుంది. గాలి బిగదీయటంవల్ల చెట్ల ఆకులు కూడ కదలి యాడటం లేదు. సిపాయిల హెచ్చరికలు మందగించాయి. తైల దీపంవల్ల కాగడాలు వెల వెల పోతున్నాయి. అంతవరకూ అప్రమత్తులై ఒమ్ముకత్తులు చేబూని పహరా ఇచ్చిన అంతఃపుర ఖోజాలు క్రమ క్రమంగా నిద్రాదేవి అంకపీఠిపై ఒరిగి పోతున్నారు.

సరిగ్గా ఆ సమయంలో ఒక వ్యక్తి పైనుండి క్రిందివరకూ నల్లని ముసుగు ధరించి ఉద్యానవన తరుల చాటునుండి అడుగులో అడుగు వేసుకుంటూ నిశీధిలో ఒకడై సాగిపోతున్నాడు. నడక తీరునుబట్టి ముసుగులో ఉన్నది పురుషుడేననీ, అంతఃపుర మార్గాల కలవాటు పడిన వాడనీ, కృతనిశ్చయంతో సాగిపోతున్నాడనీ ద్యోతక మౌతోంది. ఆ వ్యక్తి అలా చాలాదూరం నడిచి ఒక సుందర హర్మ్యాన్ని సమీపించాడు. ఒక్కసారి పరిసరాలను పరికించాడు. హర్మ్య ముఖ ద్వారాన ఉన్న ఖోజా గోడకు చేరగిలపడి మైమరచి గుఱ్ఱుపెడుతూ నిద్రిస్తున్నాడు. ఎందుకైనా మంచిదనే ఉద్దేశ్యంతో ముసుగువ్యక్తి ఒక చిన్నరాయి తీసుకొని అతని సమీపాన పడేట్టు విసిరాడు. టప్ మని శబ్దమైంది. అయినా ఖోజాలో చలనంలేదు. చీమ చిటుక్కుమంటే ఉలికిపడే ఖోజా రాయిపడిన శబ్దానికి లేవలేదంటే, మంచి మైకంలోనే ఉన్నాడన్న మాట - అనుకున్నాడు ముసుగువ్యక్తి. అతనివల్ల తనకేమీ ప్రమాదం లేదనుకుని మెల్లగా అతణ్ణి సమీపించాడు. అతను ఇంకా గురకపెడుతూనే ఉన్నాడు. ముసుగువ్యక్తి అతడివంక చూస్తూనే భవనంలో అడుగిడ బోయాడు. అంతలో తటాలున ఆగిపోయాడు- ఖోజా తన ఛెంప తానే వాయించుకోవటం చూచి.

చెవివద్ద రొద చేస్తున్న మస్తికాన్ని అప్రయత్నంగా దండించ బోయి తన చెంప తానే పగుల గొట్టుకున్న ఖోజా క్షణకాలం స్పృహ

లోకి వచ్చాడు. అది గమనించిన ముసుగు వ్యక్తి స్తంభం మాటు చేసుకున్నాడు. ఖోజా దోమ నొకటి రెండు తిట్టి, మళ్ళీ గోడకు చేరగిల పడ్డాడు. ముసుగువ్యక్తి 'హమ్మయ్య' అంటూ నిట్టూర్చాడు. తన కార్య క్రమ లక్ష్యపు తీవ్రతను మననం చేసుకున్న ముసుగువ్యక్తి సుషుప్తిలో నున్న ఖోజాపైకి చెంగున లంఘించాడు. తన వస్త్రాభ్యంతరం నుండి ఒక రూమాలును తటాలున వెలికిలాగి, అతని నాశికాగ్రాన ఒకచేత అదిమి పెట్టి రెండవచేతితో అతని నోటిని మూసివేశాడు.

హఠాత్తుగా ముంచుకు వచ్చిన ప్రమాదానికి తన్ను తాను సమ్మా ళించుకోవాలని ప్రయత్నించాడు ఖోజా. కాని, అపుడే అతణ్ణి మైకం ఆవహించింది. క్రమంగా స్పృహతప్పి వాలిపోయాడు.

ముసుగువ్యక్తి విజయగర్వంతో మందిరం ప్రవేశించాడు. ఒక్కొక్క ద్వారాన్నే దాటుతూ చివరికి శయ్యాగారం చేరుకున్నాడు. ఒక్కటే ఒక్క క్రొవ్వొత్తి ఆ విశాల శయనాగారానికి వెలుగు ప్రసా దిస్తున్నది. ఆ వెలుగులో ఆదమరచి అర్ధనగ్నంగా నిద్రిస్తున్న అతివ ఆహ్వానిస్తున్నదా అనిపించింది ముసుగు వ్యక్తికి. వెంటనే ముసుగు తొలగించి దూరంగా విసిరివేశాడు. ఆ అనాఘ్రాత కుసుమాన్ని చూచిన అతడు ఉత్తేజితుడైనాడు. రోమాలు నిక్క పొడుచుకున్నాయి. కసి, ద్వేషం, మృగవాంఛ ఒక్కసారి ప్రకోపించాయి. తన్ను తాను చూసు కున్నాడు. తానూ అర్ధనగ్నంగానే ఉన్నాడు. ఛీ! ఛీ! అనుకుంటూ వెలుగు తున్న ఆ ఒక్క దీపాన్ని ఊదివేశాడు.

శయ్యాగార మంతా అంధకారం వ్యాపించింది. ఔను, కాని పనులు కటిక చీకటిలోనే జరగాలి—అనుకుంటూ శయ్యను సమీ పించాడు. నిశ్చలంగా నిద్రిస్తున్న స్త్రీ మూర్తి ప్రక్కనే ఆశీనుడైనాడు. తన దక్షిణహస్తాన్ని తీసి కంచుకరహితంగా ఉన్న ఆమెపైన వేశాడు.

శయ్యపైనున్న అతివ కొద్దిగా చలించింది. ప్రక్కకు తిరిగింది. పురుషుడు చేయి వెనక్కి తీయాలని ప్రయత్నించాడు. అంతలో అతని చేయిపై మరొకచేయి పడింది. పురుషుడు గాభరా పడ్డాడు. అతడికేమీ కనిపించటం లేదు. అంతా గాఢాంధకారం. ఎక్కడిదీ మరోహస్తం?.... పురుషునికి దిగ చెమటలు పోశాయి. చేయి వెనుకకు తీసుకోవాలని మరో సారి ప్రయత్నించాడు పురుషుడు. కాని, ఆ హస్తాన్ని బంధించిన హస్తం

కోమలమే అయినా ధృఢంగా ఉంది. ఆ చేయి తన చేతిని వక్షస్థలంపై గట్టిగా అదుముకుంటున్నదని గ్రహించిన తరువాత పురుషునికెనలేని ధైర్యం వచ్చింది. వెంటనే శయ్యపై నున్న మూర్తిపై వ్రాలిపోయాడు ఆవేశంగా. స్త్రీమూర్తి హస్తాలు అప్రయత్నంగానే, మానసికాదేశం లేకుండానే అతని శరీరాన్ని పైకి లాగుకున్నాయి.

క్షణాలు వడివడిగా పరువెత్తుతున్నాయి. వేడి ఉచ్ఛ్వాస నిశ్వాసాలు తీవ్రంగా వెలువడుతున్నాయి.

*　　　*　　　*

"ఎవరు నీవు?" హఠాత్తుగా ప్రశ్నించింది స్త్రీమూర్తి.

"ఎవరినైతే నేం — నా పంతం నెగ్గించుకున్నాను." అంటూ పురుషుడు శయ్యపై నుండి లేచాడు.

"పారిపోవటానికి ప్రయత్నించకు. నా బారినుండి తప్పించుకోవటం అసాధ్యం. ఆదమరచి నిద్రిస్తున్న నన్ను అన్యాయం చేశావ్. నీచుడా, నీకు శిక్ష తప్పదు." అంటూ స్త్రీ, పురుషుని చేయి గట్టిగా పట్టుకుంది.

"అలాగా" హేళనగా అన్నాడు పురుషుడు. తన చేయి విడిపించుకొనటానికి ఏ విధమైన ప్రయత్నమూ చేయకుండానే.

అతడి చేతిలోనుండి తన చేతిలోకి ఏదో విద్యుత్ ప్రసారం జరిగిందనిపించిన స్త్రీ అతడి చేతిని వదలివేయాలని ప్రయత్నించింది. కాని, వదలలేక పోతున్నది. ఒక వంక మనస్సు ఆగ్రహావేశాలతో నిండిపోతున్నది. వేరొక వంక హృదయం అవగాహనా సాధ్యం కాని, ఆనందంతో తన్మయం చెందుతోంది.

"ఇక వెళ్ళి రానా" అన్నాడు పురుషుడు లాలనగా.

"ఎక్కడికి వెళ్తావ్. ఈ అంతఃపురమే నీకు సజీవ సమాధి."

పురుషుడు పక పకా నవ్వాడు.

"నే నెవరో తెలిస్తే ఇలా అపహసించవ్. అసలింత తెగింపుకు పూనుకొని ఉండవ్."

"ఇంతకూ నీ వెవరు?" అన్నాడు పురుషుడు అమాయకంగా.

అహంభావ పూరితమైన స్త్రీమూర్తి తన పేరు సగర్వంగా చెప్పబోయింది. అభిమానం దెబ్బతింది. బహుశ ఏ దాసీదో అని అతడింత

పని చేసి ఉండవచ్చు. అలాంటి సందర్భంలో నిజ నామ మెరిగించి అతడి ద్వారా పదుగురి కళ్ళలోపడి పతిత కావటం కన్నా, పేరు మరుగు చేసుకోవటమే మంచిదనుకుంది. "నేను ఒక స్త్రీని" అంది.

"నిజం చెప్పావ్. ఈనాడు, ఇంతవరకూ మగరాయుడిగా చెలామణీ అయిన నీవు నిజంగా ఒక స్త్రీవైనావు."

స్త్రీమూర్తి ఉలిక్కిపడింది.

"అడవి గాచిన వెన్నెల అనుభవయోగ్యమైంది. వెన్నెలదే అదృష్టమో - అనుభోక్తదే అదృష్టమో...."

"నోర్ముయ్. అంతస్థు తెలియకుండా ప్రేలుతున్నావ్."

"నీ అంతస్థేమిటో చెప్తేగా???-నీ పేరు?"

"నా పేరా? నా పేరు జుమీలియా."

"ఇదా నీ అంతస్థు. దాసీ దానివి తల్ప మెక్కావా? నీవు నిజంగా జుమీలియావే అయితే నేను పొరపడ్డాను రోషనారా బేగం సాహెబా...."

"నేను రోషనారను కాను"

"ఎందుకలా పరువుకోసం ప్రాకులాడుతావు? స్త్రీ, స్త్రీగా జీవించక పురుషునిలా బ్రతకటం నిజమైన ప్రతిష్ట అనుకోకు. స్త్రీ సహజమైన నీలోని కోరికలను మూర్ఖ విశ్వాసాలతో, కృత్రిమమైన పురుషద్వేషంతో అణచివేయ గలిగావే కాని, అంతరింపచేయలేక పోయావ్. పరిస్థితుల ప్రాబల్యానికి లొంగిపోకుండా ప్రకృతికి విరుద్ధంగా నిలబడటానికి నీవు సర్వ సంగ పరిత్యాగిని అయిన యోగినివి కాదు. పరమాత్ముని కంకిత మైన భైరవివి కాదు. ఐహిక సుఖాల కంకితమైన నీకు శారీరక వాంఛలను త్యజించే మానసిక బలం లేదు."

"ఏమిటి నీవు మాట్లాడుతున్నది?"

"మరేం లేదు. నీవు కూడా అబలవే. ఎంత బలం ఉన్నా అబలవే. ఆ మాట గుర్తుచేయటానికే వచ్చాను. గుర్తు చేయటంలో విజయం సాధించాను. వెళ్ళి పోతున్నాను. అంతే, మరి సెలవు." పురుషుడు బయలుదేరాడు.

"ఆగు." ఆజ్ఞాపించింది రోషనార.

పురుషుని అడుగులు ఆగిపోయాయి.

"నీవెవరు?"

"ఎందుకు - ఎవరినైతేనేం. ఒక పురుషుణ్ణి."

"ఆ మాట చెప్పి తప్పించుకోలేవు. నీవు నన్ను గుర్తించావు. అలా గుర్తించకుండా ఉంటే ఒక స్త్రీ, ఒక పురుషుడు అని సరిపెట్టుకునే దాన్ని. ఈ పాడుపని జరిగిందన్న విషయమే రేపటికి పూర్తిగా మరచి పోయి ఉండేదాన్ని."

"ఆ మాట నిజమే. కాని, ఈ విషయాన్ని నేను దండోరా వేయ బోవటంలేదు."

"అయినా సరే! నా రహస్యం తెలిసిన నీవు బ్రతికి ఉన్నంత కాలమూ ఈ అంతఃపురంలో ఉండాల్సిందే. నేటితో నీకు బాహ్య ప్రపంచంతోగల అన్ని సంబంధాలూ తెగిపోయినట్లే."

"అసంభవం. నేను వెళ్ళిపోవాలి." పురుషుడు నాలుగడుగులు ముందుకు వేశాడు. తటాలున ఆగాడు. "కాని, వెళ్ళబోయేముందు నీ పొందు పొందిన వ్యక్తి ఎవరో నీకు తెలియచెప్పకుండా వెళ్తే నీ హృదయమెంత ఆరాటపడుతుందో నాకు తెలుసు. అందుకని నా స్వరూపాన్ని చూపించి మరీ వెళ్తాను" అంటూ పురుషుడు ప్రక్క గది లోనికి వెళ్ళి వెలుగుతున్న క్రొవ్వు వత్తిని చేతపట్టుకొని తిరిగి శయ్యా గారంలో ప్రవేశించాడు.

క్రొవ్వొత్తి కాంతిలో సమున్నతాకారంతో, గంభీర వదనంతో తన కెదురు నడచివస్తున్న వ్యక్తిని పరిశీలించి, ఒక్కసారిగా ఉలిక్కి పడింది రోషనార.

"నీవా?" అంది దిగ్భ్రాంతితో.

"ఔను. నేనే గుర్తించావా. చూడు, బాగా చూడు. నీ కమ్చి ప్రేటులతో తెగ పొంగినశరీరాన్ని బాగా చూడు. ఏ శరీరం మీదిగా నేటి సాయంత్రం నీవు నిర్దాక్షిణ్యంగా నడచి వెళ్ళావో ఆ శరీరమే నేటి రాత్రి నీ మీద నడచింది. అనాఘ్రాణిత కుసుమాన్నని ఇంత కాలంగా విఱ్ఱవీగు తున్న నీ అహంభావానికి, నీ పాద తాడనకు పాల్పడిన ఆ శరీరమే ఈ క్షణాన నీ అహంభావాన్ని అణచివేసింది."

"మూర్ఖుడా!" రోషావేశంలో రోషనార చెక్కిళ్ళు ఎఱ్ఱబడ్డాయి.

"మూర్ఖుడా అంటుంటే ఎంత ముద్దొస్తున్నావ్‌బేగం - రోషనారా! నీకు పాతివ్రత్యంలో నమ్మకం లేదు. ఆ మాటకొస్తే నాకూ, నీకూ

వివాహధర్మంలో నమ్మకం లేదు. అలా కాకుంటేనా, ఈ క్షణాన మన మిద్దరం భార్యా భర్తలై ఉండేవారం."

నీవు ప్రమాదకరమైన వ్యక్తివి. అసలు నీవీ అంతఃపురంలో ఎలా ప్రవేశించావ్! పోతుటీగ జొరరాని ఈ కోటలోకి ఏ మార్గాన వచ్చావ్-నీవు....నీవు ఖోజావుకావూ?" తడబడుతూసాశ్చర్యంగా ప్రశ్నించింది రోషనార.

"నీవంటి యౌవ్వన తేజో విలాసిని ఖోజాలకుకూడ మగసిరి ప్రసాదిస్తుంది. హహ్హాహ ఖోజా! హహ్హాహ ఖోజా!!" అంటూ పురుషుడు పెద్ద పెట్టున నవ్వసాగాడు.

అతడి నవ్వు పెద్దదౌతున్నకొద్దీ రోషనారలో తత్తరపాటు అధికం కాసాగింది. ఎవరైనా వింటే—ఏమైనా ఉందా. ఇంతకాలంగా తానంటే ఉన్న భయ గౌరవాలు మాయంకావూ? పదిమంది తెల్లవారితే తన్ను వ్రేలెత్తి చూపరూ??

"ఖోజా, ఆపు. అలా వికటంగా నవ్వకు...." అంది రోషనార అనునయంగా.

"రోషనారా! నీవుకూడా నన్ను ఖోజా అని ఇంకా పిలుస్తున్నావా? నీకు తెలియదూ నేను ఖోజానో కాదో హహ్హాహ" అంటూ అతను వెళ్ళబోయాడు.

"హుం-నిన్ను విడిచిపెట్టి లాభంలేదు" అంటూ రోషనార మేజాపై ఉన్న ఛురికను తటాలున అందుకుంది.

"పోనీ దగ్గరే ఉంచుకో. తొలిసారిగా వలపు చవిచూపిన ప్రియుని ఎడబాటును ఏ కాంతా సహించలేదు" అంటూ వెనుతిరిగాడు అతను.

తళ తళ మెరుస్తున్న బాకును చేత ధరించి కళ్ళనుండి అగ్నికణాలు కురిపిస్తున్న రోషనార ప్రచండ స్వరూపం అతనికి సాక్షాత్కరించింది.

"చంపుతావా రోషనారా? అసంభవం. ఇదివరకు, కొన్ని ఘడియల క్రితం నీకు నన్ను చంపగలిగిన శక్తి ఉంది. కాని, ఇప్పుడు నీవు కేవలం ఒక అబలవు. అతివవు. అన్నిల మిన్నవు. అసంభవం రోషనారా - నీవు నన్ను హత్య చేయగలగటం అసంభవం" అంటూ అతను ముందుకు నడిచాడు.

అతను దగ్గరకు వస్తున్న కొద్దీ రోషనార చలించిపోసాగింది. స్థైర్యం సన్నగిల్లుతున్నది. మనసు పరిపరి విధాల పరిభ్రమిస్తున్నది. హృదయం తహతహ లాడుతున్నది. తనను తనకు దక్కించుకోవాలని ఏంతగానో ప్రయత్నిస్తున్నది. అంతర్యుద్ధం తీవ్ర రూపం దాల్చింది.... అతను ఆమెను సమీపించాడు. ధృఢంగా బాహువులలో బంధించాడు. తనివితీర అధరామృతాన్ని ఆస్వాదించాడు. నిరోధించాలని రోషనార ఎంతగానో ప్రయత్నించింది. నిరోధించలేకపోయింది. అవయవాలు వాటంతట అవే పట్టు తప్పి అతని బాహువల్లరిలో వ్రాలిపోయాయి....

"రోషనారా! అంగీకరించావా. నీవు నన్ను చంపలేవు. ప్రపంచానికి నీవు చండశాసనివే కావచ్చు. కాని, బ్రతికి ఉన్నంత కాలం నీవు నా బానిసవు. ఇది వాస్తవం" అన్నాడు అతను బాహువులను మరింత బిగిస్తూ.

రోషనార అభిమానం దెబ్బతింది. అహంకారం పెరిగిపోయింది. జారిపోతున్న ఛురికను అప్రయత్నంగానే ఆమె చేతి వ్రేళ్ళు ధృఢంగా పట్టుకున్నాయి. అంతే! ఆ మరుక్షణంలో అతని వీపుపై చిన్న గాయమైంది. అతను కౌగిలి వదలి రెండడుగులు వెనక్కు వేసి రోషనార కండ్లలోకి చూస్తూ "హత్యా ప్రయత్నమా రోషనారా?" నవ్వుతూ ప్రశ్నించాడు.

"ఔను. బానిసగా బ్రతుకుతూ కలకాలం జీవించే కన్నా మరణించటం మేలు. మరణించే పిరికితనం నాకు లేనందువల్ల యజమానినని చెప్పుకునే వాణ్ణి హత్యచేయటం మేలు" రోషనార ధృఢ గాత్రంతో సమాధాన మిచ్చింది.

"మరి ఇంత చిన్న గాయం చేశావేం?"

"అది చాలు నీ ప్రాణం తీయటానికి."

"విషాక్తమా?"

"నీకు అన్నీ తెలుసు. నిన్ను చూస్తే ఇప్పుడు జాలివేస్తున్నది."

"పోనీలే రోషనారా! ఇంతకు ముందు కాకపోయినా ఇప్పుడు

నీవు ఆడుదాని ఔతున్నావు. అదే సంతోషం. బ్రతికి సాధించలేనిది మరణిస్తూ సాధిస్తున్నాననే తృప్తితో కన్ను మూస్తాను."

"ఖోజా" ఆందోళన ఆమె కంఠంలో ధ్వనించింది.

"నీ వన్నది నిజమే. విషం తల కెక్కుతున్నది. నీవు చేసిన పనిని తలుచుకుంటే నిన్నుకూడా నాతో పరలోకానికి తీసుకొని వెళ్ళే శక్తి నాకు ఈ క్షణాన కూడా ఉంది. కాని, పరలోకంలో కునా విశ్వాసం లేదు. ప్రపంచంలో ఎవరికీ అందని ఫలం, అందుకోవా లని ఎవ్వరూ ఆశించని ఫలం అనాయాసంగా ప్రప్రథమంగా నాకు లభించింది. అదే నాకు సంతృప్తి. రో-ష-నా-రా-ఇప్పుడు ఈ క్షణాన అనుకుంటున్నాను. ప్రతీకార వాంఛతోనే నేను నీపైన పంతం సాధించి ఉన్నట్లయితే ఈక్షణాన నాకు జరిగిన అన్యాయానికి నిన్ను కూడా కట్టకట్టి నా వెంట తీసుకొని వెళ్ళేవాడినే. కాని, అలా చేయటానికి మనసు రావటం లేదు. అంటే రోషనారా నిన్ను నేను ప్రేమిస్తున్నాను. ప్రేమి స్తున్నా-ను" అంటూ నేలపై వ్రాలి పోయాడు అతడు.

అతడి పలుకులు వింటుంటే రోషనారలోని స్త్రీత్వం పెల్లుబికింది. హృదయం స్రవించింది. కనుల వెంట అశృవులు జలజలా రాలాయి అప్రయత్నంగా.

"నిజంగా నన్ను ప్రేమిస్తున్నావా?" దీనంగా ప్రశ్నించింది రోషనార.

"ఔను. అలాగే అనిపిస్తున్నది నాకు. అంతేకాదు. నీ కనుల వెంట కన్నీళ్ళు ప్రవహించటం అపూర్వం. అది కన్నులార గాంచిన నేను—నీవు కూడ నన్ను ప్రేమిస్తున్నావనే సంతృప్తితో వెళ్ళి పోతున్నాను రోషనారా" అతని ముఖం ప్రక్కకు వాలింది. తుది శ్వాస వాతావరణంలో లీనమైంది.

"ఖోజా! నిజంగానే నేను నీకు అన్యాయం చేశాను ఖోజా" రోదిస్తూ అతడి శరీరంమీదికి వ్రాలిపోయింది రోషనార.

(సశేషం)